క్లుప్తంగా

ఇన్వర్టర్ ఏర్పాటుకు సాయం



మాచారెడ్డి : పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇన్వర్టర్ ఏర్పాటు కోసం రూ.లక్షా పది వేలు అవసరం కాగా అదే గ్రామానికి చెందిన ఇరిగేషన్ రిటైర్డ్ ఏఈ తిరుపతిరెడ్డి మంగళవారం రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి, లక్ష్మి దంపతులను హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆస్పత్రులను సందర్శించిన కేంద్ర బృందం



బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని బస్తీ దవఖానాలతో పాటు, 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని బుధవారం కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్, డాక్టర్ తంగ్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రుల్లో వసతులు, అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, వ్యాధులు, వైద్య సేవల గురించి అడిగి తెల్సుకున్నారు. వైద్యులు కీర్తి, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ దయానంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి షబ్బీర్ అలీ ఆర్థిక సాయం



రామారెడ్డి/కామారెడ్డిటౌన్: రామారెడ్డి మండలం మద్దికుంటకు చెందిన బొమ్మిడి రఘుపతి రెడ్డి ఇల్లు ఈ నెల 27న రాత్రి వేళ విద్యుదాఘాతానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఇంటి లోపల వంట సామగ్రి, నిత్యవసర వస్తువులు, బట్టలతో పాటు అన్నీ కాలిపోయాయి. సుమారు రూ.లక్షా యాభై వేల వరకు ఆస్తి నష్టం జరిగింది. బాధితుడి పరిస్థితి రామారెడ్డి మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడి ద్వారా తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం కామారెడ్డిలోని తన నివాసంలో ఈ సహాయాన్ని అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో గల రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రాజేశ్ తన వంతుగా రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతరాజేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. దాంతో ఎమ్మెల్యే మండలంలోని అధికారులకు ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నాయకులు సుప్పాల రాజు, నగేష్, పూల్‌సింగ్, గోపాల్, రాజేశ్వర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ మహరాజ్ భిక్షాటన



నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామంలో మంగళవారం గోవింద్ మహరాజ్ కామధేనువు భిక్షాటన చేశారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణకు స్వామీజీ కామధేనువు భిక్షాటన చేపట్టారు. ఆయన వెంట భక్తులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆడించేవారే కరువయ్యారు



మద్నూర్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

పీడీలు లేక ఇబ్బందులు

- రెండు మండలాలకు కలిపి ముగ్గురే వ్యాయామ ఉపాధ్యాయులు
- బోధన ఉపాధ్యాయులపైనే భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు కరువైన ప్రోత్సాహం

మద్నూర్(జుక్కల్): నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణించడం తేలికవుతుంది. ఈ ధోరణిని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అపాదించాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల విద్యను పటిష్ట పరిచేందుకు ఎన్నో నూతన కార్యక్రమాలు తీసుకొస్తున్న విద్యా శాఖ దానికి అనుబంధమైన క్రీడలను ప్రోత్సహించడంలో విఫలమవుతోంది. ఆటలను నిర్వహించి విద్యార్థులు రాణించేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను కేటాయిస్తారు. కాని ప్రస్తుతం ఆ పోస్టులు కూడా ఖాళీగా ఉండడం గమనర్హం. పాఠశాలల్లో క్రీడలు నిర్వహించాల్సిన బాధ్యత బోధనోపాధ్యాయులపైనే పడటంతో సంవత్సరంలో ఏ జాతీయ దినోత్సవాలకో రెండు మూడు సార్లు పండుగలా చేపట్టి విద్యార్థులకు బహుమతులు ఇచ్చి మమ అనిపించుకుంటున్నారు. అరకొరగా ఉన్న వసతులు, ఉపాధ్యాయులతోనే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అదే పూర్తి స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే మరింతే రాణించే అవకాశం ఉంది.

నామమాత్రంగా పీఈటీ పోస్టులు

విద్యాభివృద్ధి కోసం వేస్తున్న ప్రతి డీఎస్సీలో క్రీడలకు అన్యాయమే జరుగుతోంది. ప్రతి డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించి నామ మాత్రంగా పోస్టులు కేటాయిస్తుండటంతో మద్నూర్, డోంగ్లీ మండలాల్లో మొత్తం ప్రభుత్వ పాఠశాలలకు కలిపి ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రాథమిక పాఠశాలలు 34, ప్రాథమికోన్నత పాఠశాలలు 13, ఉన్నత పాఠశాలలు 9 ఉన్నాయి. అయితే సీపీఎస్, యూపీఎస్ పాఠశాలల్లో పీఈటీ పోస్టులు లేవు. ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులకు అప్‌గ్రేడ్ చేసి పీడీ(ఫిజికల్ డైరెక్టర్)గా మార్చారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు మాత్రమే పీడీలు ఉన్నారు. మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు బోధించే ఉపాధ్యాయులే ఆటలు ఆడించాల్సి వస్తోంది.

ఆటలు అంటే ఇష్టం



నాకు ఆటలు అంటే ఎంతో ఇష్టం. కాని మా పాఠశాలో ఆటలు ఆడిపించే పీడీలు లేకపోవడంతో దూరం అవుతున్నాం. క్రీడా పోటీల్లో పాల్గొ ని సత్తా చూపించాలని ఉన్నప్పటికీ ప్రాక్టీస్ చేయించేవారు లేరు. అధికా రులు పీడీని నియమించాలి. – మొగులాజీ, విద్యార్థి, 9వ తరగతి

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా మాకు అంతే ముఖ్యం. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది వి ద్యార్థులు ఆటలు ఆడాలని ఉన్నా ఆడిపించే వారు లేరు. దీంతో ఆట లు ఆడలేక పోతున్నాం. అధికారు లు స్పందించి చర్యలు తీసుకోవాలి. – అశోక్, విద్యార్థి, 9వ తరగతి

పోస్టులు ఖాళీగా ఉన్నాయి

ప్రభుత్వం పీడీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ఇద్దరు పీడీలు ఉన్నారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – రాములు, ఎంఈవో, మద్నూర్

ఆధ్యాత్మికం..

నేడు భీమేశ్వరాలయంలో మాఘ అమావాస్య ఉత్సవాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయంలో బుధవారం మాఘ అమావాస్య ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం పక్కనే ఉత్తరం నుంచి దక్షిణం వైపు ప్రవహించే పవిత్ర నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వయం భూలింగేశ్వరుని దర్శించుకుంటారన్నారు. సుమారు 5 లక్షల మంది భక్తులు తరలివస్తారని వారు తెలిపారు. కామారెడ్డి డిపో నుంచి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.

పుణ్యస్నానాలకు సిద్ధమైన మద్దికుంట బుగ్గ

రామారెడ్డి: మద్దికుంట శ్రీస్వయంభూ బుగ్గ రామలింగేశ్వర ఆలయం మాఘ అమావాస్య పుణ్య స్నానాలకు సిద్ధమైంది. ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్ పంతులు, ఆలయ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు.

కాలభైరవుడి ఆలయంలో..

మాఘ అమావాస్య సందర్భంగా ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో భక్తుల పుణ్యస్నానాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ప్రభు గుప్తా తెలిపారు.

అల్లమా ప్రభు జాతర



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : బొమ్మన్‌దేవ్‌పల్లిలో అల్లమా ప్రభు జాతర నేటి నుంచి ప్రారంభం అవుతుంది. దీనిలో భాగంగా బుధవారం అగ్నిగుండం, అన్నదానం, గురువారం నిండు జాతర, శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. బాన్సువాడ నుంచి బొమ్మన్‌దేవ్ పల్లికి ప్రత్యేక బస్సులు ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రం నుంచి ఆటోలు అందుబాటులో ఉంటాయి.

ముస్తాబైన వేంకటేశ్వర, హనుమాన్ ఆలయాలు



మాచారెడ్డి: గజ్యానాయక్ తండా చౌరస్తాలోని వేంకటేశ్వర, హనుమాన్ ఆలయాలు బుధవారం నిర్వహించనున్న మాఘ అమావాస్య జాతరకు ముస్తాబైనట్లు ఆలయ ఈవో ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు.

కటికం మలన్న ఆలయం..

దోమకొండ: మాఘ అమావాస్య ఉత్సవాలకు దోమకొండ గ్రామ శివారులోని గుండ్ల చెరువు వద్ద గల కటికం మల్లన్న ఆలయం ముస్తాబైంది. ఆలయానికి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ఉదయం చెరువులో స్నానాలు చేసి అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు. ప్రతియేటా జాతర సైతం నిర్వహిస్తారు.

నాగమడుగు స్నానాలకు ఏర్పాట్లు



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట శివారులోని మంజీరా నదిలో మంగళవారం మాఘ అమావాస్య పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా మాఘ అమావాస్య రోజున నాగమడుగులో స్నానాలు ఆచరించి నాగజముడు, శివునికి అభిషేకాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.



డిజిటల్ యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే డిజిటల్ యాత్ర వాల్ పోస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ప్రతినిధులు డేవిడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి మట్టినమూనాల సేకరణ



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి వాగుపై పోచమ్మ, సంగెం రేవుల వద్ద వంతెనల నిర్మాణానికి మంగళవారం పీఆర్‌ఏఈ సురేశ్ కొలతలు, మట్టి నమూనాలను సేకరించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. వెంటనే నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు వంతెనల నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి



బాన్సువాడ: ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పత్రి ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా 5లోగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు, కార్మికులు రేణుక, సురేఖ, కమర్, జైల్‌సింగ్, సంగీత, తదితరులున్నారు.

'పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావొద్దు'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమణ

కామారెడ్డి టౌన్: రాబోయే పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దని జిల్లా ప్రభుత్వ మానసిక వైద్యాధికారి జి.రమణ సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాలు– మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు' అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీనేజ్ వయసులో వచ్చే అవరోధాలను అధిగమించాలని, ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు బానిస కావద్దన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే డిప్రెషన్‌కు గురి కావద్దని, పాస్ అవడానికి మరొక అవకాశం ఉంటుందని, పరీక్షల్లో ఫెయిలై కూడా ఆయా రంగాల్లో ఎన్నో విజయాలు సాధించిన ప్రముఖుల గురించి వివరించారు. మానసిక, ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న టెలీ మానస్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 14416 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య, జిల్లా సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, ఆరోగ్య కార్యకర్త సుజాత, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని అధ్యాపకుల డిమాండ్



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

భిక్కనూరు : తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విశ్వవిద్యాలయాల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో.. ఖాళీల భర్తీ విషయంలో పదిహేనేళ్లుగా బోధిస్తున్న తమను విస్మరించడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులకు బేసిక్, హెచ్‌ఆర్‌ఏ, డీఏతో కూడిన వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి అర్హతలు కలిగిన అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ గుప్తా, సునీత, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, నిరంజన్ శర్మ, సరిత, వైశాలి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పర్మళ్లలో బోరుమోటారు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల గ్రామంలో నెల కొన్న తాగునీటి సమస్యపై మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో 'గ్రామాల్లో తాగునీటి గోస' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం గ్రామంలో ఉన్న బోరుబావిలో కొత్త బోరుమోటారును బిగించారు. పది రోజులుగా మహిళలు పడిన ఇబ్బందులు తొలగిపోవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎంపీవో మలహరి, కార్యదర్శి, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రాజంపేట: పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కొండాపూర్ ఐకేపీ సీసీ బాగయ్య సూచించారు. మంగళవారం కొండాపూర్ క్లస్టర్‌లోని శ్రీ శక్తి గ్రామ సంఘం పిల్లల ఆరోగ్యంపై సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదేళ్ల లోపు చిన్న పిల్లలలో పోషణపై అవగాహన కల్పించారు. పిల్లలలో పోషణ లోపిస్తే అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. కార్యదర్శి లావణ్య, కోశాధికారి రాజమణి, వీవోఏఏ రజిత పాల్గొన్నారు.

సమాచారం..

నేడు తాడ్వాయికి ఎమ్మెల్యే రాక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలానికి బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు విచ్చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అఖిల్ రావు తెలిపారు. ఎర్రాపహాడ్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారని చెప్పారు.

వచ్చే నెలలో ఆలయ వార్షికోత్సవాలు

కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ అష్టవింశతి(28)వ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 2, 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు శ్రీరేణుకాదేవి ఆలయ అభివృద్ధి సంఘం, గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ..

జైగౌడ ఉద్యమం ..



కామారెడ్డి టౌన్: జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్, ప్రధాన కార్యదర్శి అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం..



కామారెడ్డి టౌన్: బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, యువజన సంఘం అధ్యక్షుడు ఐరేని సందీప్, మాజీ కౌన్సిలర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



టీచర్స్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

కామారెడ్డి టౌన్: గత వర్షాకాలంలో కురిసిన వానలకు పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఈ రోడ్డు ధ్వంసమైంది. రోడ్డు నంబర్–4లో మురికి కాలువ పక్కన ఉన్న ఈ రోడ్డు మొత్తం కూలిపోయింది. దీంతో కాలనీవాసులు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్తం

దుండగులను కఠినంగా శిక్షించాలి



బాన్సువాడ/బాన్సువాడ రూరల్ : పంజాబ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైశయ్య, ఆలిండియా అంబేద్కర్ సంఘం బాన్సువాడ డివిజన్ నేత ఎస్ నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ పట్టణం, బోర్లం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి వారు వేర్వేరుగా మాట్లాడారు. అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలే ఇలాంటి ఘటనలకు పురిగొల్పుతున్నాయని ఆరోపించారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని విజయకృష్ణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్ మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.7లక్షలతో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. నాయకులు మైశాగౌడ్, యూసుఫ్, సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు..

బిచ్కుంద(జుక్కల్): పెద్ద తక్కడ్‌పల్లిలో మంగళవారం కొత్తగా బోరు మోటారును కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రవి పటేల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సమస్య ఉందని, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి బోరు, మోటారుకు నిధులు మంజూరు చేశారన్నారు. విద్యుత్ ఏఈ పవన్ కుమార్, నాయకులు మాధవరావు దేశాయి, జీపీ కార్యదర్శి పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుండూర్, కౌలాస్ గ్రామాల్లో మంగళవారం కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు రమేశ్ దేశాయ్, సాయాగౌడ్, సంజుపటేల్, ప్రకాష్ పటేల్, దత్తు, బాబు, విఠల్, ప్రసాద్ తదితరులున్నారు.

'డబుల్' ఇళ్లకు పట్టాలివ్వండి



కామారెడ్డి టౌన్: తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లి డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవో రంగనాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఈ సందర్భంగా ఆర్డీవో హామీ ఇచ్చారు. రామేశ్వరపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కమిటీ అధ్యక్షుడు మాజీద్, ఉపాధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.